ఆలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ రద్దు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాతగుట్ట ఆలయంతోపాటు శివాలయంలో విధులు నిర్వహించే ఆరుగురు అర్చక, ఉద్యోగుల క్రమబద్ధీకరణను రద్దు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసిందని ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ తెలిపారు. పాతగుట్ట ఆలయంలో విధులు నిర్వహించే సత్యనారాయణచార్యులు, భరత్‌కుమారాచార్యులు, మురళీధర్‌శర్మ, శివాలయంలో టి.నర్సింహమూర్తి, పి.నరసింహమూర్తితోపాటు సన్నాయి వాయిద్యకారుడు మస్తాన్‌ను 121 జీఓ కింద 2018లో క్రమబద్ధీకరించారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో 121 జీఓ వర్తించనందున వారి క్రమబద్ధీకరణ చెల్లుబాటు కాదని పేర్కొన్నట్లు డీఈఓ వెల్లడించారు. వారిలో సన్నాయి వాయిద్యకారుడు మస్తాన్ మృతిచెందగా మిగతా ఐదుగురి పోస్టుల క్రమబద్ధీకరణ నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. మస్తాన్ కుటుంబ సభ్యులకు అందుతున్న అలవెన్స్‌లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఐదుగురు అర్చకులు పూర్వ కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగనున్నారు. ఇప్పటి వరకు వారు తీసుకున్న వేతనం రికవరీ చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

పట్టభద్రుల ఓటర్లు 4,27,289

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మార్చి14 వరకు అభ్యంతరాల స్వీకరణ

నల్లగొండ, ఫిబ్రవరి 24 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితాను నల్లగొండ కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన శనివారం ప్రచురించారు. నియోజకవర్గవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఇప్పటి వరకు 4,27,289 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగా, అందులో 2,66,622 మంది పురుషులు, 1,60,661మంది మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు ఉన్నారు. జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీకి రాజీనామా చేయగా తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు గానూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఈ నెల 6 వరకు గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటివరకు 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటే మార్చి14 వరకు తెలియజేయాలని కలెక్టర్ హరిచందన సూచించారు. శనివారం విడుదల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాలతోపాటు ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాలు, నియోజకవర్గంలో గుర్తించిన 600 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను మార్చి 14 వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్లు
సిద్దిపేట	5	4,412
జనగాం	27	21,870
హనుమకొండ	67	39,167
వరంగల్	59	40,250
మహబూబాబాద్	36	32, 622
ములుగు	17	9,532
భూపాలపల్లి	16	11,814
భద్రాద్రి కొత్తగూడెం	55	36,926
ఖమ్మం	115	76,869
యాదాద్రి భువనగిరి	37	31,778
సూర్యాపేట	71	47,465
నల్లగొండ	95	74,584
మొత్తం	600	4,27, 289

సూర్యాపేటలో మాట్లాడుతున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ ఆరాధే

కేసుల సత్వర పరిష్కారానికే అదనపు కోర్టులు

- కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే
- కోదాడ, సూర్యాపేటలో అదనపు కోర్టులు ప్రారంభం

కోదాడ/సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 24 : కేసుల సత్వర పరిష్కారానికే అదనపు కోర్టులు మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే తెలిపారు. సామాన్యులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. శనివారం కోదాడ కోర్టులో సబ్ కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఆయన ప్రారంభించారు. కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సూర్యాపేటలో రెండో అదనపు ప్రథమశ్రేణి న్యాయస్థానానికి శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ వివాహ సంబంధాల వివాదాలతో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించిన మహిళలను పదే పదే తిప్పకుండా సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. న్యాయవాదులు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని న్యాయ వ్యవస్థకు వన్నె తేవాలని సూచించారు. అన్ని కోర్టుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. హైకోర్టు జడ్జిలు వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయసేనారెడ్డి, పుల్లా, కార్తీక్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు సీనియర్ న్యాయవాదులు వృత్తి నైపుణ్య విలువలను అందించాలన్నారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తిని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున సన్మానించారు. సూర్యాపేటకు చేరుకున్న హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్ స్వాగతం పలికారు. పోలీసులు న్యాయమూర్తులకు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లా నాగేశ్వర్‌రావు, కొల్లి సత్యనారాయణ, కోదాడ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి సాధు శరత్‌బాబు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డితో కలిసి నక్కగూడెం ఎత్తిపోతల పునరుద్ధరణకు శంకుస్థాపన

కిష్టాపురంలో మిర్చి కూలీలతో మాట్లాడుతున్న మంత్రులు భట్టి, ఉత్తమ్, వెంకట్‌రెడ్డి

చింతలపాలెం, ఫిబ్రవరి 24 : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మండలంలోని నక్కగూడెం గ్రామంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో నిర్మించిన నక్కగూడెం(రాగ్యానాయక్) ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వైద్య సౌకర్యం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 27న చేవెళ్లలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ చేతుల మీదుగా 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తాపత్రయపడే వ్యక్తి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని అభినందించారు. మరుగునపడిన లిఫ్ట్‌లను పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో మహిళలకు వడ్డీలేని రుణాలను, పోడు భూములకు పట్టాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆశ వర్కర్లకు, స్కావెంజర్లకు ప్రతి నెల జీతాలు అందజేస్తామని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతే హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కింద 3,200 ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో 2012లో పథకాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. పులిచింతల బ్యాక్ వాటర్ కింద సుమారు 1.2 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ మునిగి పోవడంతో లిఫ్ట్ పునరుద్ధరణ కోసం రూ.37.70 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. బెట్టతండా, రెడ్లకుంటకు కూడా లిఫ్ట్‌లు మంజూరు చేసినట్లు చెప్పారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఉన్నటువంటి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిస్థితిపై పూర్తి వివరాలు తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇంతలా శ్రమించే నాయకుడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు.

రైతులతో మాటామంతి...

నక్కగూడెం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు శంకుస్థాపన ముగించుకుని దొండపాడు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో మంత్రులు కాన్వాయ్ దిగి రోడ్డు వెంట ఉన్న మిర్చి పంటలను పరిశీలించి.. రైతులు, కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, సూర్యాపేట చీఫ్ ఇంజినీర్ ఓవి రమేశ్‌బాబు, ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి, కోదాడ ఎస్ఈ నర్సింహారావు, ఈఈలు సత్యనారాయణ, శ్రీనివాస్, హుజూర్‌నగర్ డీఈ స్వామి, తాసీల్దార్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ ప్రగతిపై మంత్రుల సమీక్ష

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

క్షేత్రస్థాయిలో సైట్ విజిట్

టీఎస్‌జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్ష

దామరచర్ల, ఫిబ్రవరి 24 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్‌ను శనివారం సందర్శించారు. హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరిన మంత్రులు యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ఉదయం 10:32 గంటలకు ల్యాండ్ అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌తోపాటు అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు కాన్వాయ్‌లో సైట్ విజిట్ చేశారు. 10:52 గంటలకు మీటింగ్ హాల్‌కు చేరుకోగా జెన్‌కో భద్రతా సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జెన్‌కో అధికారులతో 10:55 నుంచి 12:16 గంటల వరకు మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాంట్ ప్రగతి, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలుపలికి రాగానే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్‌కు చెందిన 270 మంది ఓఅండ్‌ఎం కార్మికులు వారిని కలిసి ఇక్కడ తమకు సరైన వసతులు, పనులు లేవని, తిరిగి తమను పాల్వంచకు బదిలీ చేయాలని వినతి పత్రం అందజేశారు. వారితోపాటు పవర్‌ప్లాంటులో భూములు కోల్పోయిన కొంత మంది నష్టపరిహారం అందలేదని, భూనిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రైల్వే లైన్ కింద భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని వినతి పత్రాలు అందజేశారు. అనంతరం 12:25 గంటలకు మంత్రులు హెలికాప్టర్‌లో మేళ్లచెర్వుకు బయల్దేరారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ రిజ్వీ, జిల్లా కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, డైరెక్టర్ అజయ్, ప్లాంటు సీఈ సమ్మయ్య, ఆర్డీఓ చెన్నయ్య, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ప్లాంట్ వద్దకు చేరుకున్న స్థానిక నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో వారు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

లక్ష్మీ నరసింహస్వామి వారికి చక్రతీర్థ స్నానం చేయిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

- మంత్రపూర్వక స్నానమాచరించిన లక్ష్మీనరసింహుడు
- ఘనంగా మహాపూర్ణాహుతి.. శ్రీపుష్పయాగం
- నేత్రపర్వంగా పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

ప్రత్యేకాలంకరణలో స్వామివారు

లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్టో యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప బ్రహ్మణ్య కేశవ జనార్ధన వాసుదేవ లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : పాతగుట్ట లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా చక్రతీర్థస్నానం జరిపించారు. కల్యాణం, రథోత్సవంతో అలసిన స్వామివారికి చక్రతీర్థ సేవ నిర్వహించి శృంగార డోలోత్సవానికి సిద్ధం చేశారు. నిత్యారాధనల అనంతరం పారాయణికులచే చతుర్వేద పారాయణాలు, యాజ్ఞీకులచే నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు జరిపారు. అనంతరం మహాపూర్ణాహుతి మహోత్సవాన్ని పాంచరాత్రగమశాస్త్రరీతిలో అత్యంత వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం చక్రతీర్థ మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యాజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు తమ మనస్సు, తనువును ఒక్కటిచేసి శ్రీ నారసింహ.. జయ నారసింహ అంటూ జయజయ ధ్వానాలు చేస్తూ లక్ష్మీనరసింహస్వామి వారి శ్రీచక్రాళ్వార్‌కు జరిపించిన చక్రతీర్థ మహోత్సవాన్ని తిలకించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామి శ్రీచక్రాళ్వార్‌తో కలిసి మంత్రపూర్వక స్నానం గావించారు. స్థానిక భజన మండలి సభ్యులు భజన నిర్వహించారు. ఆలయంలో వేదపారాయణాలు జరిపారు.

శ్రీపుష్పయాగం.. డోలారోహణం

పాతగుట్టలో సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం, డోలారోహణం, దేవతా ఉద్వాసన వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహుడి ఉత్సవాలకు ఆహ్వానించిన దేవతలను మంత్రముల చేత ఆహ్వానించిన పిదప తిరిగి వారి స్వస్థలాలకు సంప్రదాయంగా పంపించే దేవతా ఉద్వాసన వేడుక అత్యంత వైభవంగా సాగింది. భగవానుడి నామాలతో అర్చన వేడుకలు నిర్వహించే ప్రక్రియను శ్రీపుష్పయాగం పాంచరాత్రగమశాస్త్రరీతిలో చేపట్టారు. సహస్ర నామాలతో అమ్మవారిని, భగవానుడిని పుష్పాలతో ఆరాధించారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞీకులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థిఘళ్ సీతామనోహరాచార్యులు, పారాయణందారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీకాంత్, విజయకుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు అష్టోత్తర శతఘటాభిషేకం

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహదాశీర్వచనం, పండిత సన్మానం నిర్వహించి బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

హాలియా సమీపంలోని వజ్రతేజ రైస్‌మిల్లులో సినిమా షూటింగ్‌లో పాల్గొన్న నటుడు వెన్నెల కిశోర్

హాలియాలో విశ్వంభర

- రైస్‌మిల్లులో చిరంజీవిపై సన్నివేశాల చిత్రీకరణ
- మెగాస్టార్‌ను చూసేందుకు తరలి వచ్చిన అభిమానులు

హాలియా, ఫిబ్రవరి 24 : హాలియా పరిధిలోని వజ్రతేజ రైస్‌మిల్లులో శనివారం విశ్వంభర సినిమా షూటింగ్ జరిగింది. సినిమాలో హీరోగా నటిస్తున్న చిరంజీవి షూటింగ్‌లో పాల్గొన్నారు. చిరంజీవి రైస్ మిల్లు ఓనర్‌గా నటించే సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్‌లో వెన్నెల కిశోర్, చమ్మక్‌చంద్ర, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి షూటింగ్‌కు వస్తున్న విషయం తెలుసుకున్న అభిమానులు, చుట్టుపక్కల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. షూటింగ్‌కు ఆటంకం కలుగకుండా హాలియా సీఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

చందంపేట పోలీసులపై దాడి

కేసు విచారణకు వెళ్లిన ఎస్ఐ, కానిస్టేబుళ్లకు గాయాలు

కడప జిల్లాలో ఘటన

గాయాలపాలైన టేకులపల్లి అంజయ్య

చందంపేట, ఫిబ్రవరి 24 : కేసు విచారణలో భాగంగా ఏపీలోని కడప జిల్లాకు వెళ్లిన చందంపేట ఎస్ఐ, కానిస్టేబుళ్లపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందంపేట మండలం కంబాలపల్లికి చెందిన టేకులపల్లి అంజయ్య, నేలపట్ల ఆంజనేయులు, మామిళ్ల సైదులు, పిల్లి అంజయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, మరో ఇద్దరు కలిసి కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యవారిపల్లికి చెందిన ఓబుగాని సాంబయ్య, అతని కుమారుడు ఓబుగాని శివకు విడుతల వారీగా డబ్బు చెల్లించే ఒప్పందం మేరకు రూ.54.50లక్షల విలువైన గొర్రెలను గతేడాది డిసెంబర్‌లో కొనుగోలు చేశారు. ఒప్పందం మేరకు డబ్బు చెల్లించే విషయంలో సాంబయ్య కాలయాపన చేస్తుండడంతో విక్రయదారులు చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అప్పటి ఎస్ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. ఆయన బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన సతీశ్ కేసు విచారణ కోసం ఈ నెల 22న ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు గొర్రెల వ్యాపారులతో కలిసి ఓ ప్రైవేటు వాహనంలో చిన్నయ్యగారిపల్లికి వెళ్లారు. కేసు విషయమై ఓబుగాని సాంబయ్యతో మాట్లాడుతుండగా, పలువురు గ్రామస్తులు జోక్యం చేసుకొని పోలీసులపై దాడికి పాల్పడ్డారు. దాంతో ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లు, గొర్రెల విక్రయదారులకు గాయాలయ్యాయి. వాహనం ధ్వంసమైంది. ఈ మేరకు మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం.

ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, నాయకులు

సేవాలాల్ ఆశయాలే గిరిజనులకు స్ఫూర్తి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: సంత్ సేవాలాల్ ఆశయాలే గిరిజనులు, యువతకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్‌నాయక్ అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మార్గం అందరికీ ఆచరణీయమన్నారు. మొదట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బంజారా భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రమేశ్ మహారాజ్ మహాభోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నాయకులు స్కైలాబ్‌నాయక్, రతన్‌సింగ్‌నాయక్, రవితేజ, భాస్కర్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణయ్య, నాగునాయక్, సిద్ధూనాయక్, దశరథ్ నాయక్, నాగరాజునాయక్, మాన్యనాయక్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాల దొంగల ముఠా అరెస్ట్

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 24 : డీజే సౌండ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగతనం చేస్తున్న నలుగురు వ్యక్తులు గల అంతరాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువైన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ జి.రవి కేసు వివరాలు వెల్లడించారు. జాతీయ రహదారి 65పై జనగామ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సౌండ్ సిస్టమ్‌లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికాలను గుర్తించారు. వాహనంలో ఉన్న నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలానికి చెందిన కుర్రతుల్పా అనే వ్యక్తిని విచారించగా అవి దొంగిలించిన వస్తువులు అని ఒప్పుకొన్నాడు. కేసు నమోదు చేసి విచారించగా కోదాడకు చెందిన ధరావత్ బాలకృష్ణ, భర్మావత్ గురుచరణ్, నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ వంశీతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. గతేడాది నవంబర్ నెల నుంచి మాచర్ల, సూర్యాపేట, కోదాడ, చిలుకూరు, చివ్వెంల ప్రాంతాల్లో రాత్రి సంచరిస్తూ ఫంక్షన్ హాళ్లలో, డీజే షాపుల ముందు పార్కింగ్ చేసిన వాహనాల నుంచి యాంప్లిఫయర్లు, మిక్సర్లు, క్రాస్ ఓవర్స్ దొంగిలించి వాటిని ఒక దగ్గర దాచి వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముదామనుకుని శనివారం ప్రయత్నించగా పట్టుబడినట్లు తెలిపారు. సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్, ఎస్ఐలు ఎస్‌కే యాకుబ్, పి.లోకేశ్, బాలకృష్ణ, క్రైమ్ సిబ్బంది కరుణాకర్, కృష్ణ, సైదులు, ఆనంద్, మధు, ఐటీ సెల్ సుధాకర్, రవిను ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

కనుల పండువగా వేణుగోపాల స్వామి కల్యాణం

మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రుక్మిణీ సత్యభామ సమేత వారిజాల వేణుగోపాల స్వామి తిరుకల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు స్వామివారి ఎదుర్కోళ్ల మహోత్సవం చూడముచ్చటగా కొనసాగింది. కల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్యయాదవ్, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్ రెడ్డి, బత్తుల ఊషయ్య, గోసుల భద్రాచలం, దార యాదయ్య, యాట సైదులు పాల్గొన్నారు.